అమరావతి బాటలో....

- పునర్నిర్మాణ పనుల ప్రారంభ వేడుకకు జిల్లానుంచి పెద్దఎత్తున తరలిన ప్రజలు
- ప్రభుత్వం తరపున 30 బస్సుల ఏర్పాటు
- మరో 13 బస్సుల్లో, 300 కార్లలో నేతలు



చిత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ వేడుకకు జిల్లానుంచి పెద్దఎత్తున ప్రజలు వెళ్లారు.అమరావతి అభివృద్ధికి ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతరాయం ఏర్పడినా.. విజనరీ చంద్రబాబు కృషితో మళ్లీ పనులు వేగవంతమవుతున్నాయి. శుక్రవారం ప్రధాని మోదీ అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, బహిరంగ సభలో పాల్గొననున్నారు.ఈ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు జిల్లా ప్రజలూ బయల్దేరారు.ప్రభుత్వం తరఫున కుప్పం మినహా 6 నియోజకవర్గాల నుంచి 5 చొప్పున మొత్తం 30 బస్సుల్ని ఏర్పాటు చేశారు. ఒక్కో బస్సుకు ఒక్కో వీఆర్వోను ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయా బస్సుల్లో ప్రయాణించేవారి వివరాలన్నీ వీఆర్వోలు నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు అందిస్తారు.గురువారం రాత్రి, శుక్రవారం మూడు పూట్లా భోజనాల ఖర్చులకు ఒక్కో బస్సుకు రూ.20 వేల చొప్పున కలెక్టర్ సుమిత్‌కుమార్ అందించారు.జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి గురువారం రాత్రి 8 గంటలకు బస్సులు బయల్దేరగా.. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు అమరావతికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సుమారు 1500 మంది శుక్రవారం ఉదయం బస్సు దిగగానే వారికి అవసరమైన సౌకర్యాలు కూడా అధికారుల బృందమే చూసుకుంటుంది. ఒక్కో మండలం నుంచి ఒక్కో బస్సు బయల్దేరుతుండగా.. మళ్లీ బస్సులు వచ్చే వరకు ఆయా తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు.ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేసిన బస్సులే కాకుండా టీడీపీ నాయకులు కూడా తమ సొంత నిధులతో వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా 13 బస్సుల్లో, 300 కార్లలో అమరావతి సభకు వెళ్లినట్లు అంచనా. ప్రభుత్వం తరఫున 1500 మంది కాకుండా పార్టీ తరఫున మరో 2 వేల మందికిపైగా వెళ్లినట్లు సమాచారం.

పుంగనూరు రోడ్డు నేడు జాతికి అంకితం



పుంగనూరు, మే 1(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలో రూ.41 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన 10 కిలోమీటర్ల జాతీయ రహదారిని శుక్రవారం అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. వేలూరు-కర్నూలు జాతీయ రహదారిలోని పుంగనూరులో ఇరుకు రోడ్లు, వాహనాల రద్దీతో రోజూ ట్రాఫిక్ స్తంభిస్తూ వాహనచోదకులు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. రోడ్డు ఆక్రమణలు, ట్రాఫిక్ పెరగడంతో మదనపల్లె నుంచి పుంగనూరు వచ్చే మార్గంలోని భీమగానిపల్లె నుంచి గూడూరుపల్లె మదరసా వరకు కేంద్రప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మించింది. లారీలు , ఇతర వాహనాలు పట్టణంలోకి రాకుండానే మదనపల్లె, చిత్తూరు మార్గంలో ప్రయాణించే వాహనాలన్నీ బైపాస్‌లో వెళుతున్నాయి. ట్రాఫిక్ తగ్గినా స్థానిక వాహనాలు, పుంగనూరుకు వచ్చే ట్రాఫిక్ వల్ల ఇరుకు రోడ్లతో అవస్థలు తప్పలేదు.ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతిపాదనలతో పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను కేంద్రం మంజూరు చేసింది. భీమగానిపల్లె వద్ద కృష్ణదేవరాయల విగ్రహం సర్కిల్ నుంచి రాంపల్లె, కొత్తఇండ్లు, ఎన్టీఆర్ సర్కిల్, ప్రైవేటు బస్టాండ్, ఇందిరా సర్కిల్, ఎంబీటీ రోడ్డు, తూర్పు మొగసాల, గూడూరుపల్లె, పలమనేరు రోడ్డులోని మదరసా వరకు 10 కిలోమీటర్లు గతంలో ఉన్న 7 మీటర్ల వెడల్పు రోడ్డులో విస్తరణ పనులను ఎన్నికల క్రితం చేపట్టి ఆక్రమణలు తొలగించి 10 మీటర్లకు పెంచారు. రూ.41కోట్లతో కేంద్రప్రభుత్వం జాతీయరహదారుల అధికారులతో పనులు చేయించింది. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు, వాకింగ్ ఫుట్‌పాత్, పలు చోట్ల రోడ్డుపై పశువులు, వాహనాలు రాకుండా ప్రమాదాలు జరగకుండా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు శుక్రవారం అమరావతిలో పుంగనూరు రోడ్డును వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

రేణిగుంట-నాయుడుపేట సిక్స్ లేన్ రోడ్డుకు నేడు ప్రధాని ప్రారంభోత్సవం

తిరుపతి, మే 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట నుంచీ నాయుడుపేట వరకూ నిర్మించిన సిక్స్ లేన్ రోడ్డును నేడు ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి నుంచీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ. 2510 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ 57 కిలోమీటర్ల రోడ్డు తిరుపతి జిల్లాను కోల్‌కతా-చెన్నై నేషనల్ హైవే-16తో అనుసంధానం చేసింది. దీంతో రోడ్డు ప్రమాదాలకు, మరణాలకు చెక్ పెట్టడంతో పాటు ఈ ప్రాంతంలో పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.వాస్తవానికి రేణిగుంట నుంచీ నాయుడుపేటకు డబుల్ రోడ్డు మాత్రమే వుండేది. 1996-2004 నడుమ వాజ్‌పేయ్ ప్రధానిగా వున్న సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు చొరవతో పూతలపట్టు-నాయుడుపేట ఫోర్ లేన్ రోడ్డు మంజూరైంది. అయితే భూసేకరణ సంబంధిత సమస్యలతో ప్రాజెక్టు సుదీర్ఘ కాలం పెండింగులో పడింది. 2014-19 నడుమ తిరిగి చంద్రబాబు సీఎంగా వున్న కాలంలో బంగారుపాళ్యం మండలం మొగిలి నుంచీ పూతలపట్టు మండలం రంగంపేట, చంద్రగిరి, తిరుపతి మీదుగా నాయుడుపేటకు సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు వెళ్ళాయి. కేంద్రం వెంటనే ఆమోదించినా భూసేకరణ విషయంలో పలువురు రైతులు కోర్టును ఆశ్రయించడంతో పూర్తిస్థాయిలో సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం జరగలేదు. పలుచోట్ల పనులు పెండింగు పడ్డాయి. ఆ క్రమంలో బంగారుపాళ్యం మండలం మొగిలి నుంచీ చంద్రగిరి వరకూ పనులు పూర్తయ్యాయి. చంద్రగిరి నుంచీ రేణిగుంట వరకూ పనులు పెండింగులో వున్నాయి. రేణిగుంట-నాయుడుపేట నడుమ 57 కిలోమీటర్ల స్ట్రెచ్ పనులు 2022 జనవరి 31న ప్రారంభమయ్యాయి. హైబ్రిడ్ ఆన్యుటీ మోడ్ పద్ధతిలో నిర్మాణం జరిగింది. సిక్స్ లేన్ రోడ్డుకు అనుబంధంగా అన్ని గ్రామాల వద్దా సర్వీసు రోడ్లు, 3 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 5 వెహిక్యులర్ అండర్ పాస్‌లు, 7 ఫ్లై ఓవర్లు, 15 బ్రిడ్జిలు, 56.827 కిలోమీటర్ల డ్రైన్లు కూడా నిర్మించారు.



ప్రమాదాలకు ఇక చెక్

రేణిగుంట-నాయుడుపేట నడుమ సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడం రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టనుంది. అలాగే రేణిగుంట-నాయుడుపేట నడుమ 55 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి బస్సుల్లో రెండు గంటల సమయం పట్టేది. కార్లు, జీపులు అయితే గంటన్నర పట్టేది. ఇపుడు సిక్స్ లేన్ రోడ్డు పూర్తి కావడంతో రేణిగుంట-నాయుడుపేట నడుమ దూరం మరో రెండు కిలోమీటర్లు పెరిగింది. అయినా ఈ 57 కిలోమీటర్ల దూరాన్ని బస్సుల్లో గంటలో, కార్లు, జీపుల్లో అయితే 45 నిమిషాల్లో అధిగమిస్తున్నారు. సిక్స్ లేన్ రోడ్డు తిరుపతి జిల్లా స్వరూప స్వభావాలను మార్చివేయనుంది. అభివృద్ధి అవకాశాలు గణనీయంగా పెరగనున్నాయి.అంతిమంగా పారిశ్రామిక, ఆర్థిక కార్యలాపాలు జోరందుకోనున్నాయి. దీనివల్ల జిల్లాకు, రాష్ట్రానికి ఆర్థికాదాయంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఇంకో వైపు రియల్‌ఎస్టేట్ పరంగా భూముల విలువ గణనీయంగా పెరగనుంది. దానివల్ల రైతులు, స్థలాల యజమానులు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి.

తెలంగాణ హైకోర్టులో సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సుధాకరరెడ్డి



వెదురుకుప్పం, మే 1(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లెకు చెందిన కె.సుధాకరరెడ్డి తెలంగాణ హైకోర్టులో సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు.కె.రామచంద్రారెడ్డి, జయలక్ష్మి దంపతుల కుమారుడైన సుధాకరరెడ్డి వెదురుకుప్పం మండలంలోని జక్కిదొన జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నారు.పట్టుదలతో ఎదిగిన సుధాకరరెడ్డి ప్రస్తుతం తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో ఆదాయపన్నుశాఖ తరఫున సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు.ఈ విషయం తెలిసిన బంధువులు, స్నేహితులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

న్యాయవాదులకు డీజే అరుణ సారిక సూచన





మాట్లాడుతున్న డీజే అరుణసారిక - బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి శ్రీనివాసులును సన్మానిస్తున్న న్యాయవాదుల సంఘం నాయకులు

చిత్తూరు లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని న్యాయవాదులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక సూచించారు. జిల్లా జడ్జి (డీజే)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు గురువారం న్యాయవాదుల సంఘం భవనంలో న్యాయవాదులు స్వాగత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. న్యాయవాదులు కోర్టు ఆవరణంలో ఉన్న లైబ్రరీకి వెళ్లి పుస్తకపఠనం చేసి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కేసులు త్వరగా పరిష్కరించడానికి న్యాయమూర్తులకు సహకరించాలన్నారు. మూడో కోర్టు న్యాయమూర్తిగా ఉన్న శ్రీనివాస్ బదిలీపై పీలేరుకు వెళ్లడంతో ఆయన్ను న్యాయవాదుల సంఘం నాయకులు సన్మానించారు. పలువురు న్యాయమూర్తులనూ సత్కరించారు. న్యాయమూర్తులు శంకర్‌రావు, రవి, శిరీష, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయుడు, కార్యదర్శి సురేష్ రెడ్డి, భూప్రసన్నతోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

టమోటా రైతుకు గిట్టుబాటేదీ?



సోమల, మే 1 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజు రోజుకూ తగ్గిపోతుండడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.గురువారం మొదటి రకం 15కిలోల బాక్సు 90రూపాయలకు తగ్గిపోయింది. రెండో రకం, మూడో రకం కాయలు రూ.40 నుంచి రూ.60 మాత్రమే పలికాయి. కొందరు వ్యాపారులు 30కిలోల బాక్సు తోటల వద్దనే రూ. 130కి కొనుగోలు చేశారు.నెల రోజులుగా 15కిలోల బాక్సు 150రూపాయలకు మించడం లేదు.జనవరి, ఫిబ్రవరి, నెలల్లో నాట్లు వేసిన రైతుల పొలాల్లోని టమోటాలు మార్కెట్‌కు భారీగా వస్తున్నాయి. పుంగనూరు, పలమనేరు టమోటా మార్కెట్లకు భారీగా సరుకు చేరుకుంటోంది. సోమల మండలంలోనే 1000 ఎకరాలకు మించి టమోటా కోతలు జరుగుతున్నాయి.సోమల, కరకమంద, నెల్లిమంద, ఇరికిపెంట, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె పంచాయతీల్లో విస్తారంగా తోటలున్నాయి. ఎకరా సాగుకు రూ. 2లక్షల దాకా ఖర్చు చేసిన రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.మరోవైపు టమోటా కోతలకు, ఇతర తోట పనులకు కూలీల కొరత అధికంగా ఉంది.

తొలి రోజు 95 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పంపిణీలో భాగంగా తొలి రోజైన గురువారం జిల్లాలో 95 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో 2,63,728 మంది లబ్ధిదారులకు 2,50,808 మందికి పంపిణీ చేశారు. 12,920 మందికి పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. నూతన నిబంధనల మేరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం ఏడు గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. మిగిలినవారికి మరో రెండ్రోజుల్లో అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి.. పుంగనూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. గ్రామాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థల్లో కమిషనర్లు పర్యవేక్షించారు.

సింగిల్‌విండోల పీఏసీలకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోలు) అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు ప్రభుత్వం పొడిగించింది. జిల్లాలోని 75 సింగిల్ విండోలకు పర్సన్ ఇంచార్జి కమిటీల గడువు బుధవారంతో ముగిసింది.దీంతో గురువారం నుంచి అక్టోబరు 30 వరకు పులిచెర్ల, నింద్ర, బైరెడ్డిపల్లె, పుంగనూరు, సదుం, కోసలనగరం, బయ్యప్పగారిపల్లె, అగరం రామకృష్ణ, పెనుమూరు, తవణంపల్లె, దిగువమాగం, అరగొండ, సత్యవేడు విండోల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పొడిగిస్తూ రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యాశాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు సెంట్రల్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) వన్‌గా యూజే సుకుమార్ గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తుండిన రంగస్వామి ఫిబ్రవరిలో పదవీ విరమణ చెందడంతో ఏడీ టూ వెంకటేశ్వరరావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు ఆదోని విద్యాశాఖలో ఏడీగా పనిచేస్తున్న సుకుమార్‌ను పాఠశాల విద్యాశాఖ చిత్తూరు డీఈవో కార్యాలయానికి బదిలీ చేసింది. అలాగే జిల్లా ఉమ్మడి పరీక్షల కేంద్రం కార్యదర్శిగా చిత్తూరు రూరల్ తుమ్మింద జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆర్.హేమాద్రి బాధ్యతలు చేపట్టారు.

అమ్మ కోసం

- స్కూటర్‌పై 98వేల కిలోమీటర్ల సంకల్పయాత్ర



శ్రీవారిని దర్శించుకున్న ఆనందంలో అమ్మ, కొడుకులు

పాత బజాజ్ చేతక్ స్కూటర్ నడుపుతూ కొడుకు.. వెనుక సీటుపై అమ్మ.. ఒకటీ రెండూ కాదు, ఇలా 98వేల కిలోమీటర్లు తిరిగి తిరుమలకు వచ్చారు ఈ తల్లీకుమారులు. ఉల్లాసంగా ఉత్సాహంగా దూసుకుపోతున్న వీరిని పలకరించినపుడు ఆసక్తికరమైన అనేక సంగతులు పంచుకున్నారు. స్కూటర్ నడుపుతున్న దక్షిణామూర్తి కృష్ణకుమార్‌ది మైసూరు. బెంగళూరులోని ఒక కార్పొరేట్ సంస్థలో టీం లీడర్‌గా ఉద్యోగం. 2015లో తండ్రి చనిపోవడంతో అమ్మను బెంగళూరుకు తీసుకువచ్చాడు. జీవన సహచరుడ్ని కోల్పోయిన దుఃఖంలోంచి అమ్మను బయటకు తీసుకురావడానికి రోజూ ఆఫీసు నుంచి వచ్చాక ఆలయాల గురించి చెప్పేవాడు. ఆమె ఎంతో ఆసక్తిగా వినేది. ఒకరోజు ఎందుకో.. 'అమ్మా.. నువ్వు ఇప్పటిదాకా ఏయే ఆలయాలు సందర్శించావు?' అని అడిగాడు. నోటితో కాకుండా తొణికిసలాడే కన్నీటితో అమ్మ సమాధానం చెప్పింది. తన సమీపంలో ఉండే ఒక్క ఆలయానికి కూడా ఆమె ఇప్పటిదాకా వెళ్లనేలేదు అని తెలుసుకుని తల్లడిల్లిపోయాడు. 68 ఏళ్ల వయసు వచ్చినా ఇల్లు తప్ప ఆమెకు మరో ప్రపంచం తెలీదు. 'నీకు దేశంలో ఉన్న అన్ని ఆలయాలూ చూపిస్తానమ్మా!' అని కృష్ణకుమార్ తల్లికి మాటిచ్చాడు. ఉద్యోగం చేస్తూ అమ్మకి ఆలయాలన్నీ చూపించడం సాధ్యం కాదని అతనికి అర్థమైంది. 2018లోనే రూ.60 వేలు జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలేశాడు. 2018 జనవరి 16న తన బజాజ్ స్కూటర్ మీదే 'మాతృ సేవా సంకల్ప యాత్ర' ప్రారంభించాడు. కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్.. ఇలా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలన్నీ తల్లితో స్కూటర్‌పై తిరుగుతున్నాడు ఈ 45 ఏళ్ల కుమారుడు. నేపాల్, భూటాన్‌కూ తల్లితో స్కూటర్‌పైనే వెళ్లాడు. ఇప్పటికి 98,109 కిలోమీటర్లు ప్రయాణించాడు. గురువారం తిరుమలకు చేరుకుని తల్లి చూడరత్నమ్మతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నాడు. తన సంకల్పయాత్రకు అవరోధం కాకూడదని కృష్ణకుమార్ పెళ్లి కూడా చేసుకోలేదు. ఎందుకీ త్యాగం? అని అడిగితే, 'చనిపోయాక శ్రాద్ధకర్మలు ఘనంగా చేయడం కాదు.. బతికి ఉన్నపుడు సంతోషపెట్టడమే కొడుకుగా నా బాధ్యత' అని సమాధానం ఇచ్చాడు. ఈ సంకల్ప యాత్రలో ప్రయాణిస్తున్నది ఇద్దరు కాదు, ముగ్గురు. అంటూ తన స్కూటర్ వైపు మురిపెంగా చూశాడు. 'నాకు 21 ఏళ్ల వయసులో నాన్న ఇచ్చిన కానుక ఇది. దీని మీద తిరుగుతూ ఉంటే నాన్న కూడా మాతోపాటే యాత్రలు చేస్తున్నట్టుగా ఉంది. ఈ యాత్రకు ముగింపు లేదు. అమ్మా నేనూ ఓపిక ఉన్నంతదాకా ఇలా తిరుగుతూనే ఉంటాం. ఒక్కో గుడినీ సందర్శిస్తూ ఉంటే అమ్మ గొప్ప ఆనందం పొందుతోంది. నాకు జన్మనిచ్చిన తల్లికి ఇంతకన్నా ఏవిధంగా రుణం తీర్చుకోగలను?' అని అమ్మను అల్లుకుపోయి ఆనందంగా చెప్పాడు కృష్ణకుమార్.



బైక్‌పై కుమారుడు కృష్ణకుమార్, తల్లి చూడరత్నమ్మ

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రైతులకు అండగా చంద్రన్న



రైతులకు రాయితీ వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం, మే 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం రామకుప్పం వ్యవసాయ అధికారి కార్యాలయంలో పలువురి రైతులకు రాయితీతో వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏవో అమృత, వైస్ ఎంపీపీ వెంకటరామ గౌడ్, గుర్రప్ప, నేతలు గుర్రప్ప, మహమ్మద్ రఫీ, విశ్వనాథ్, మనోహర్, జయశంకర్, కామరాజ్ నాయక్, గజేంద్ర, రామలింగా రెడ్డి, కృష్ణారెడ్డి, బాలరాజు, సుబ్రి, నరసింహులు పాల్గొన్నారు.

స.హ చట్టం బోర్డులో ఎట్టకేలకు పేర్లు మార్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమాచార హక్కు చట్టం బోర్డులో మార్చిన అధికారుల పేర్లు

చౌడేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమాచార హక్కు బోర్డులో అధికారులు ఎట్టకేలకు పేర్లు మార్పు చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సహ చట్టం చట్టం బోర్డులో పేర్లు గందరగోళం' అనే వార్త ప్రచురితం కావడంతో తహసీల్దార్ హనుమంతు స్పందించి బోర్డులో పేర్లు తాత్కాలికంగా మార్పు చేశారు.

పుదిపట్ల పాఠశాల చెంతనే చెత్త



పుదిపట్ల హైస్కూల్ పక్కనే డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్త

చౌడేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదిపట్ల హైస్కూల్ పక్కనే డంపింగ్ యార్డ్‌ను తలపించేలా చెత్తాచెదారం నిండిపోయింది. గత కొన్ని నెలలుగా చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' అంటూ చెప్పుకుంటున్నా.. నామమాత్రంగానే చర్యలు చేపడుతుండటం గమనార్హం. ఇలా చెత్త పేరుకుపోవడంతో విద్యార్థులు దోమల కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటను చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థినికి అభినందనలు



పవిత్రను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు, అధ్యాపకులు

పలమనేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థిని పి.పవిత్రను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు. కళాశాలలో బీఎస్సీ చదివిన అనంతరం శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివిన పవిత్ర ఇటీవల జరిగిన యూజీసీ సీఎస్ఐఆర్ పరీక్షలో 117వ ర్యాంకుతో జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చిఫెలో) సాధించింది. ఈ సందర్భంగా పవిత్రను కళాశాలలో అభినందించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి రైతుకు గాయాలు

పుంగనూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- తిరుపతి మార్గంలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా.. సోమల మండలం ఇరికిపెంటకు చెందిన రైతు శ్రీనివాసులునాయుడు (45) టమోటా పంటకు పురుగులమందు కోసం ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చాడు. మందులు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో చదళ్ల సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సహాయంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కార్మికుల హక్కులపై అవగాహన అవసరం



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ఉదయం 4 గంటలకే విధులకు హాజరై పారిశుధ్య పనులు చేపట్టడం అభినందనీయమని.. కార్మికులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పేర్కొన్నారు. గురువారం మే డే సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పారిశుధ్య కార్మికులకు పంచిపెట్టారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కేవలం విధులకే పరిమితం కాకుండా హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, పలమనేరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మునిరాజ, సీనియర్ న్యాయవాదులు లోకేష్, అరీఫుల్లాఖాన్, సయ్యద్ మొహిద్దీన్, మాధవ్, మున్సిపల్ కార్మికులు, న్యాయసిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో హరిప్రసాద్

కల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతాంగం ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేటలో ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఖర్చు తక్కువ అవుతుందని, ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. పర్యావరణానికి మేలు చేసే పద్ధతిని అవలంబించాలని, దీంతో ఆగ్యకరమైన ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధు, మాస్టర్ ట్రైనర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం ఘటన అప్రజాస్వామికం



నిరసన తెలుపుతున్న హిందూ సంఘాలు

వి.కోట, మే 1 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఘటన ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని బీజేపీ పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ కూడలిలో పహల్గాం ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ చేపట్టారు. మండల బీజేపీ అధ్యక్షులు సోమశేఖర్, జనసేన మండల కన్వీనర్ బాబు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాజ్, నేతలు బంగారురెడ్డి, రవికుమార్, యతేంద్ర, చలపతి, నవీన్‌కుమార్‌రాజు, ధనుంజయ, ప్రమీళమ్మ, హరి, రామచంద్ర, మోహన్, పద్మానాభం, టీడీపీ, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని మాజీ సైనికుడికి గాయాలు



గాయపడిన శ్రీనివాసులురెడ్డి

పుంగనూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె- పలమనేరు మార్గంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని మాజీ సైనికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. చౌడేపల్లె మండలం చారాలకు చెందిన మాజీ సైనికుడు శ్రీనివాసులురెడ్డి(49) పెద్దపంజాణి మండలంలోని కమ్మినాయునిపల్లె వద్దగల హెచ్‌పీసీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గురువారం విధులు పూర్తి చేసుకుని ద్విచక్రవాహనంలో చారాలకు వెళ్తుండగా మల్లసముద్రం వద్ద కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడటంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

95.53 శాతం పింఛన్ల పంపిణీ

పలమనేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో గురువారం 95.53 శాతం మందికి మే నెల పింఛన్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 4,514 మంది లబ్ధిదారులు ఉండగా.. ఒక్కరోజులో 4,312 మందికి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారికి శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంగళంలో పడకేసిన పారిశుధ్యం..!

● అవస్థలు పడుతున్న గ్రామస్తులు ● పట్టించుకోని అధికారులు



మంగళంలోని వీధులపై ప్రవహిస్తున్న మురుగునీరు

పుంగనూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. లోపించిన పారిశుధ్యంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు మురుగు కాలువల నుంచి బయటకు వెళుతుండగా గ్రామస్తులు కొంతమంది కాలువల్లో మురుగునీరు ప్రవహించకుండా మట్టితో అడ్డకట్ట వేయడంతో మురుగునీరు వీధులపై ప్రవహిస్తున్నాయి. వీధుల్లో తిరగడానికి ఇబ్బందిగా మారింది. వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోయారు. దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు తెలిపినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి మురుగుకాల్వలపై మట్టిని తొలగించి దోమల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మిక సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



కుప్పంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ



పుంగనూరులో జెండా ఎగురవేస్తున్న కార్మికులు



పలమనేరులో జెండా ఎగురవేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కుప్పం, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేష్‌బాబు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పంలో గురువారం కుప్పం మున్సిపల్ టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు పట్టణంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో పెయింటర్ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు కూడలిలో కార్మికులు జెండా ఎగురవేశారు. ఎర్ర జెండాలతో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ చేశారు. కడా పీడీ వికాస్ మర్మత్ ర్యాలీలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, సతీష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, పలువురు నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

● చౌడేపల్లెలో మేడే సందర్భంగా సంతగేటు వద్ద గురువారం కార్మికల సంఘం సభ్యులు సీపీఎం, సీఐటీయూ జెండాలనుఎ ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు . కార్యక్రమంలో నాయకులు చంద్ర, శేఖర్, రామకృష్ణ, బ్యాంకు రెడ్డెప్ప, కూరపత్తి శ్రీనివాసులు, వాసు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

●రామకుప్పం: రామకుప్పంలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ డాక్టర్ రాజన్ కుటుంబ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

● గుడుపల్లె: గుడుపల్లెలో గురువారం మేడేను కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. కార్మికులు గుడుపల్లె బస్ స్టాండ్ నుండి ర్యాలీగా రైల్వే స్టేషన్ క్రాస్ వరకు చేరుకొన్నారు. వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా వారు కార్మిక నాయకులు మాట్లాడుతూ... కార్మికులు అందరు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం అందరూ పోరాడాలని కోరారు. కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

● పుంగనూరు: కార్మికుల హక్కులు పోరాటాలతోనే సాధ్యమవుతుందని సీఐటీయూ పట్టణ కార్యదర్శి మురళీ పేర్కొన్నారు. మే డే సందర్భంగా గురువారం స్థానిక ఇందిరా సర్కిల్‌లోని భారత్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో కార్యదర్శి రమణ, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● గంగవరం: ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి కార్మికులందరూ కలిసి రావాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అన్నారు ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం మేడేను పురస్కరించుకొని గంగవరంలోని అంబేద్కర్ భవనం వద్ద జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరులో గురువారం మేడేను కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు జండాను ఎగురవేశారు.

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మేడే సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

● వి.కోట: వి.కోట పట్టణంలో కార్మిక సంఘాలు మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ డివిజన్ కార్యదర్శి గోవిందప్ప నేతృత్వంలో జెండా ఎగురవేశారు.

అమరావతికి టీడీపీ నాయకుల పయనం



అమరావతికి బయలుదేరిన టీడీపీ నాయకులు

చౌడేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలోని టీడీపీ నాయకులు గురువారం సాయంత్రం అమరావతికి బస్సులో బయలుదేరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి తహసీల్దార్ హనుమంతు ఆధ్వర్యంలో 2న అమరావతిలో జరుగనున్న అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి స్థానిక టీడీపీ నాయకులు, రైతులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వీఆర్వోలు జయకుమార్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ నాయకులు రమణ, వేలూరి సుబ్రహ్మణ్యం, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

● వి.కోట: నవ్యాంధ్ర రాజధానిగా అమరావతి పునఃనిర్మాణం చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి ఫలించాలని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ అభిప్రాయ పడ్డారు. గురువారం సాయంత్రం మండలంలోని 18 గ్రామ పంచాయతీల నుంచి సుమారు 150 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు రెండు ప్రత్యేక బస్సులు, పలు కార్లలో ప్రజా రాజధాని అమరావతికి పయనమయ్యారు. దుర్గమాంబ ఆలయం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం బయలుదేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, సుబ్బన్న, సోము, శబరీష్, భక్తా, నారాయణరాజు, జనార్దన్‌రెడ్డి, సతీష్, శ్రీనివాసులు, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

తిరుపతి, మే 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి నెల్లూరుకు తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని తిరుపతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, చిత్తూరు, బంగారుపాళ్యం, తిరుపతి జిల్లా తిరుపతి, పాకాల, చంద్రగిరి నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని వ్యాను ద్వారా నెల్లూరుకు తరలిస్తున్నారు. తిరుపతి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రకు అందిన సమాచారం మేరకు వెస్ట్ సీఐ మురళీమోహన్ నేతృత్వంలో పోలీసులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది కృష్ణాపురం ఠానా వద్ద పట్టుకున్నారు. మూడు టన్నుల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. బైరెడ్డిపల్లి మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన ఎం.కిషోర్ రెడ్డి హస్తమున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వెస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

కుప్పంలో పింఛన్ల పండుగ



కుప్పంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, మే 1 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. కుప్పం మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం స్వయంగా పేదల ఇళ్లకు వెళ్లి మరీ పింఛన్లు పంపిణీ చేశారు. పైపాళ్యంలో జరిగిన పంపిణీలో పీఎస్ఎంతోపాటు టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వళ్లియప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్ర శేఖర్, రాష్ట్ర తెలుగు యువత నాయకుడు మణి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

● కల్లూరు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా కొనసాగుతోందని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ కురవపల్లిలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతుడికి పింఛన్ అందించారు.

● పుంగనూరు: కూటమి ప్రభుత్వ పాలనలోనే ప్రజా సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుతున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. గురువారం మంగళం పంచాయతీలో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలాహలంగా వసంతోత్సవం



సోమల పురవీధుల్లో ఊరేగుతున్న శివపార్వతులు

సోమల, మే 1 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని గురువారం వసంతోత్సవం కోలాహలంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. వసంతోత్సవం సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసి ఉట్లోత్సవం, తపస్మాన్ అధిరోహణకు యువకులు రంగునీళ్ల, బురదమట్టిని చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. తపస్మాన్‌ను అధిరోహించడానికి యువకులు పోటీలు పడ్డారు. బజారువీధికి చెందిన పోలూరు బాలాజీ తపస్మాన్‌ను అధిరోహించి విజేతగా నిలిచాడు. అనంతరం పురవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు బీవీ. సోమశేఖర్, నరేంద్రబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



సోమలలో ఉట్లోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న యువత

నేటి నుంచి అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



చౌడేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 2 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 1753లో పుంగనూరు జమీందారు ఇమ్మడి చిక్కరాయలు నిర్మించిన అత్యంత పురాతనమైన ఆలయంలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు మే 2న అంకురార్పణ, 3న ధ్వజారోహణం, 4న యాళివాహనం, 5న శేషవాహనం, 6న రావణ బ్రహ్మవాహనం, 7న నంది వాహనాలు, 8న కల్యాణోత్సవం, గజవాహనం, 9న రథోత్సవం, 10న అశ్వవాహనం, 11న హంస వాహనం, ధ్వజావరోహణం, 12న ప్రథమ శయనోత్సవం, 13న ద్వితీయ శయనోత్సవం, 14న ఉయ్యాలోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

10 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 10న ధ్వజారోహణం, శేష వాహనోత్సవం, 11న శ్రీవారి కల్యాణోత్సవం, 12న గరుడోత్సవం, రథోత్సవం, 13న హంస వాహనోత్సవం, 14న సింహవాహనం, హనుమంత వాహనం, 15న పుష్పపల్లకి సేవ, 16న గజవాహనం, 17న ఊంజలోత్సవం, అశ్వవాహనం, దోపోత్సవం, 18న వసంతోత్సవం, పుష్పయాగం జరుగుతుందని.. భక్తులు పాల్గొనాలని కోరారు.

దేవరకొండ, గౌనివాని చెరువు ప్రాంతాల్లో
ఏనుగుల హల్‌చల్


దేవరకొండ వద్ద ఏనుగుల సంచారం

బంగారుపాళ్యం, మే 1 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం టేకుమంద బీట్‌లోని దేవరకొండ, గౌనివానిచెరువు ప్రాంతాల్లో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. మండలంలో సుమారు 14 ఏనుగులు ఉన్నట్లు సమాచారం. ఇందులో 10 పెద్దఏనుగులు, 4 పిల్లల ఏనుగులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి ప్రస్తుతం గుంపు నుంచి విడిపోయి అటవీప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. వీటిలో కొన్ని నీటి సౌకర్యం ఉండటంతో దేవరకొండ, గౌనివానిచెరువు ప్రాంతాల్లో తిష్ఠ వేశాయి. గురువారం మధ్యాహ్నం కూడా ఎండవేడిమి తట్టుకోలేక గౌనివానిచెరువులోకి వచ్చి సేదతీరుతూ కనిపించాయి.

పంటలపై దాడి చేయకుండా చర్యలు

ఏనుగులు పంటలపై దాడి చేయకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్ఎస్‌వో రమేష్ తెలిపారు. రాత్రిపూట తమ సిబ్బంది, ట్రాకర్ల సాయంతో బాణసంచా కాలుస్తూ.. పెద్ద శబ్దాలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే డ్రోన్ సాయంతో వాటి కదలికలపై నిఘా పెడతామన్నారు. రైతులు, దేవరకొండకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఆగని ఒంటరి ఏనుగు దాడులు


ధ్వంసమైన వరి పంటను చూపుతున్న రైతు

కల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు ఆగక కొనసాగుతూనే ఉన్నాయి. పంటలకు అపార నష్టం వాటిల్లుతుండగా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బుధవారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు దేవళంపేట పంచాయతీ పెనుబాలవారిపల్లి సమీపానికి చేరుకుంది. గ్రామంలోని రైతు నారాయణకు చెందిన 15 కొబ్బరి చెట్లు, 50 అరటిచెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. 3 పనస చెట్ల కొమ్మలను విరిచేసింది. అర్థ ఎకరా వరిపంటను తొక్కేసింది. మిట్టమీద రాచపల్లిలోని రైతు గిరికుమార్‌రెడ్డికి చెందిన అర ఎకరా వరిపంటను తొక్కేసిన ఒంటరి ఏనుగు అడవిలోకి తిరుగుముఖం పట్టింది. రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నట్లు ప్రజలు తెలిపారు.

అడవిపందుల దాడిలో రైతుకు గాయాలు

సోమల, మే 1 (ఆంధ్రజ్యోతి): టమోటా తోటల వద్ద కాపలా ఉన్న ఓ రైతు అడవిపందుల దాడితో గాయపడిన సంఘటన సోమల మండలంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. గత కొద్ది రోజులుగా సోమల మండలంలోని సోమల, చిన్నసోమల, చెన్నయ్యగారిపల్లె, కరకమంద, అడుసుపల్లె, సరస్వతీపురం రైతులను అడవి పందులు కునుకులేకుండా చేస్తున్నాయి. టమోటా కోతల సమయంలో తోటల్లోకి అడవి పందులు రాత్రి వేళ సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈక్రమంలోనే రైతులు పొలాల వద్దనే రాత్రి జాగరణ చేస్తున్నారు. ఏదో సమయంలో దాడులతో నష్టం జరుగుతుంది. బుధవారం రాత్రి సోమల సమీపంలోని టమోటా తోట వద్ద రైతు గంగాధరం నిద్రపోతుండగా పదికి మించి అడవి పందులు రావడం గుర్తించాడు. వాటిపైకి రాళ్లు రువ్వడంతో తిరగబడ్డాయి. దీంతో పరుగులు పెట్టిన గంగాధరం కింద పడిపోవడంతో గాయపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


రవితేజ(ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- పలమనేరు మార్గంలోని ఓం శక్తి ఆలయ సమీపంలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పెద్దపంజాణి మండలం అండిగానిపల్లెకు చెందిన కేశవులు కుమారుడు రవితేజ(25) ఇంటి నుంచే ఉద్యోగం చేస్తున్నాడు. బెంగళూరుకు వెళ్లిన రవితేజ గురువారం సాయంత్రం తిరిగి పుంగనూరు నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా ఓం శక్తి ఆలయ సమీపంలో ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సుబ్బరాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతర ఊరేగింపులో పాతకక్షలతో దాడి

● ముగ్గురికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న సునీల్

పలమనేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు గంగమ్మ జాతర చాటింపు సందర్భంగా జరిగిన ఊరేగింపు కార్యక్రమంలో బుధవారం తెల్లవారుజామున ప్రత్యర్థుల దాడిలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. పలమనేరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సునీల్ గంగమ్మ జాతర ఊరేగింపులో పాల్గొని వి.వి. మహల్ రోడ్డుపై వస్తుండగా పాతకక్షలతో సమీపంలోని రఘువీరారెడ్డి కాలనీకి చెందిన యువకులు దాడిచేశారు. బీరు సీసాలు, కర్రలతో దాడిచేశారు. వారిని అడ్డుకున్న అంబేడ్కర్ నగర్‌కు చెందిన సమీర్, హరికుమార్‌లపై సైతం చేయి చేసుకున్నారు. దాడిలో సునీల్ తలకు, వీపుపైన బీరుబాటిల్ పగులగొట్టి పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సునీల్, సమీర్, హరిలకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు అందించారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ఇటుకల బట్టీకు కలప, మట్టి అక్రమ రవాణా

పట్టించుకోని అధికార యంత్రాంగం


మిట్టూరులో ఇటుక బట్టీల వద్ద ఉన్న కలప

చౌడేపల్లె, మే1(ఆంధ్రజ్యోతి):అటవీశాఖ అధికారులకు ఇటుకల బట్టీలు కాసుల వర్షం కురిపించే కల్పతరువుగా మారాయన్న విమర్శలు విన్పిస్తున్నాయి.చౌడేపల్లె మండలం పుదిపట్ల పంచాయతీలోని మిట్టూరు సమీపంలో సుమారు 50 నుంచి 60 బట్టీలున్నాయి.సుమారు 90 కుటుంబాలు ఇటుకల బట్టీలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.ఈ బట్టీలకు ప్రధానంగా అవసరమైన మట్టిని చెరువుల్లోనుంచి తరలించేసి వాడుకుంటున్నారు.50 వేల ఇటుకలు కాల్చాలంటే 4 నుంచి 5 ట్రాక్టర్ల కట్టెలు అవసరమవుతాయి.అటు ఫారెస్టు అధికారుల నుంచి కానీ, ఇటు రెవెన్యూ అధికారుల నుంచి కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే ఇటుక బట్టీలకు దళారులు అడవుల నుంచి కట్టెను తరలిస్తున్నారు.ఒక ట్రాక్టర్‌కు 2 వేల నుంచి 3 వేల రూపాయలు లంచం ఇవ్వాల్సివస్తోందని వారు చెబుతున్నారు.ఇటుక బట్టీల నిర్వాహకులేమో ఫారెస్టు గార్డులు తమ వద్ద ఒక్కో బట్టీకి రూ.10 నుంచి 20 వేలు చలానా పేరుతో వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రేంజర్ శ్రీరాములును వివరణ కోరగా ఇటుకల బట్టీల వద్ద అక్రమ కలప నిల్వ ఉందన్న విషయమే తమకు తెలియదని తెలిపారు.సిబ్బందిని పంపి విచారిస్తామ న్నారు. అటవీ సంపదను కాపాడేందుకు ఇటుక బట్టీల నిర్వాహకులకు కలప బదులు బొగ్గు, వరి పొట్టు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాల్సి వుంది.



కోసలనగరం పరిశ్రమల స్థాపనకు అనుకూలం

ఎమ్మెల్యే భానుప్రకాష్


అగస్త్య సోలార్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలోని కోసలనగరం పరిసరాలు పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉన్నాయని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం కోసలనగరం ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమలను అభివృద్ధి చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని తెలిపారు. ఔత్సాహికులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని స్థానిక టీడీపీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అగస్త్య సోలార్ కంపెనీ ప్రతినిధులు, తహసీల్దార్ కిరణ్, మండల సర్వేయర్ శేఖర్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోళ్ల పరిశ్రమతో ఉపాధి కల్పనకు చర్యలు : కలెక్టర్


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): కోళ్ల పరిశ్రమ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కోళ్ల పెంపకందారులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పౌల్ట్రీరంగంలో ఆసక్తి ఉన్నవారికి నెక్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారి జాబితా సిద్ధం చేయాలని, ఇందుకోసం జిల్లాస్థాయిలో ఓ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అవసరమైన ఆర్థికసాయం అందించేలా త్వరలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తామనీ వెల్లడించారు. నెక్ కమిటీ ఈసీ మెంబర్ రమేష్ మాట్లాడుతూ.. పౌల్ట్రీ రంగంపై ఆసక్తి ఉన్నవారికి సహకారం అందిస్తామన్నారు. జిల్లా పశుసంవర్థక శాఖాధికారి హరీఫ్, ఎన్ఈసీ జోనల్ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, వివిధ మండలాల కోళ్ల పెంపకందారులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే వన్నెకుల క్షత్రియుల అభ్యున్నతి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం రాజు తదితరులు

కుప్పం, మే 1 (ఆంధ్రజ్యోతి): వన్నెకుల క్షత్రియుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక చర్యలు తీసుకుంటున్నారని వన్నెకుల క్షత్రియ రాష్ట్ర సాధికార సమితి అధ్యక్షుడు జీఎం.రాజు అన్నారు. కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన సెల్వరాజ్‌కు అవకాశం కల్పించిన నేపథ్యంలో కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం మునిరాజు ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు, కార్యకర్తలు సమావేశమయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో జీఎం.రాజుతోపాటు మాజీ ఎంపీపీ సాంబశివం, నాయకులు కాణిపాకం వెంకటేశ్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ఏమీ తెలియని వన్నెకుల క్షత్రియులను రాజకీయంగా ఈ స్థాయికి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గతంలో ఎంపీపీ, జడ్పీటీసీ అవకాశాలు కల్పించారని, ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో వన్నెకుల క్షత్రియ సాధికార సమితి అధ్యక్షుడుగా జీఎం. రాజు, కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేణుగోపాల్‌కు కల్పించిన అవకాశాలు తమ సామాజిక వర్గానికి ఆయన కల్పించిన ఉన్నతావకాశాలన్నారు. కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా తమ కులస్తుడైన సెల్వరాజ్‌ను ఎంపిక చేసి విజయం అందించడం మరువలేదని పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ భరత్, ఆయన పార్టీ కులం పేరు చెప్పుకుని వన్నెకుల క్షత్రియులను దోచుకున్నారు తప్ప.. చేసిందేమీ లేదని విమర్శించారు. వైసీపీలోని వన్నెకుల క్షత్రియులు విషయం గుర్తించి తమ పార్టీలోకి రావాలని, వారి పార్టీ నాయకుల దోపిడీ గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. మున్సిపల్ చైర్మన్ వి.సెల్వరాజ్ మాట్లాడుతూ పేద, సామాన్య కార్యకర్త అయిన తనకు పెద్ద పదవి కట్టబెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. అవకాశం వచ్చేందుకు కారణమైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, నాయకులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్ సురేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వన్నెకుల క్షత్రియులంరా కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

డ్రైవర్ పరిస్థితి విషమం, ప్రయాణికులకు గాయాలు



పాలసముద్రం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఒకటి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. తిరుపతి నుంచి పాలసముద్రం మండలం వెంగళరాజుకుప్పం మధ్య నడిచే ఆర్టీసీ బస్సు గురువారం పళ్లిపట్టు షోలింగర్ రోడ్డులోని స్వామినాయుడుకండ్రిగ వద్దకొచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రామ్మూర్తితోపాటు వెనుక సీట్లలోని రెండు వరుసల్లో కూర్చొన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ రామ్మూర్తి, ప్రయాణికులు మునస్వామి చంద్రశేఖర్‌లను 108 వాహనం ద్వారా తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. డ్రైవర్ తలకు తీవ్ర గాయమవడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. స్వల్ప గాయాలైన ఎనిమిది మందికి అత్తిమంజేరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేశారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. తమిళనాడులోని పళ్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


క్రీడాపరికరాలు పంపిణీ చేస్తున్న ఎస్పీ జయప్రకాష్

చిత్తూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్ కోరారు.జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని చిత్తూరులోని డీఎస్‌ఏ మెసానికల్ మైదానంలో గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం డీఎస్‌డీవో బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో గురువారం 28 చోట్ల శిబిరాలు ప్రారంభమయ్యాన్నారు. మిగిలిన 20 చోట్ల శుక్రవారం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జయప్రకాష్ చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.ఇండియన్ బ్యాంకు రిటైర్డ్ జీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఈ నెలాఖరు వరకూ జరగనున్నాయి.14 క్రీడాంశాల్లో 48 శిక్షణ శిబిరాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో కేంద్రానికి 25 మంది చొప్పున బాలలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే చాలాచోట్ల క్రీడా పరికరాలు లేకపోవడం కొరతగా కన్పించింది. పలు మండల కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ఏర్పాటుకు సంబంధించి అక్కడి హెచ్‌ఎం, పీఈటీలకు సమాచారం ఇవ్వకపోవడం అధికారుల పనితీరుకు అద్దంపట్టింది.





కృష్ణతేజ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం జరిగిన తన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్, సీబీఎస్ తేజ కృష్ణమూర్తి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి. ఈ కార్యక్రమంలో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, సుమలత దంపతులు, తిరుమల ఆయిల్ డిస్ట్రిబ్యూటర్స్ తిరుపతి ఎండీ జెట్టి సతీష్, జెట్టి కవిత తదితరులు పాల్గొన్నారు. చదలవాడకు పలువురు నేతలు, విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే చైతన్య యాత్ర

● సీపీఎస్ ఉద్యోగులు


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమస్యలు తెలియజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): తమను ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా మార్చే విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎస్ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు తమను ఎన్నికల సమయంలో వాడుకుని.. తర్వాత గాలికొదిలేస్తున్నాయని ఆరోపించారు. తమ సమస్యల పరిష్కారానికే చైతన్య యాత్రను ప్రారంభించామన్నారు. ఈ యాత్ర రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మూడు విడతలుగా నిర్వహిస్తున్నామన్నారు. తొలి విడతలో భాగంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల కలెక్టర్లను కలిసి తమ సమస్యలను ప్రభుత్వానికి నివేదించమని కోరతామన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేవరకు పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్, గౌరవాధ్యక్షుడు రామాంజినేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, నేతలున్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌వోల నిరసన


నినాదాలు చేస్తున్న సీహెచ్‌వోలు

చిత్తూరు అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ద్వారా సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌వోల) నిరసన నాల్గవ రోజైన గురువారం కూడా కొనసాగింది. నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దెలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్‌ను అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి తమను మినహాయించాలని డిమాండ్ చేశారు. వీరికి యూటీఎఫ్ నేతలు మద్దతు ప్రకటించారు.

తవణంపల్లెలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత


బోసిపోయిన చిత్తూరు గాంధీ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు తట్టుకోలేక జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తవణంపల్లె మండలంలో అత్యధికంగా 40.4, చిత్తూరు, గుడిపాలలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. నదుం, ఎస్ఆర్‌పురంలో 38.9, యాదమరిలో 38.8, జీడీ నెల్లూరు, సోమలలో 38.1, బంగారుపాళ్యంలో 37.2, చౌడేపల్లె, ఐరాల, నగరి, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురంలో 37, పులిచెర్ల, రొంపిచెర్లలో 36.7, పూతలపట్టు, వెదురుకుప్పంలో 36.5, శాంతిపురం, గుడుపల్లెలో 36.4, కార్వేటినగరంలో 36.3, పుంగనూరులో 36.2, వి.కోటలో 36, పెద్దపంజాణిలో 35.9, బైరెడ్డిపల్లె, గంగవరంలో 35.2, పలమనేరులో 35.1, రామకుప్పంలో 34.6, కుప్పంలో 34.1 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలకు రచనల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): కుప్ప రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలకు అభ్యుదయ రచయితల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ రోజా ప్రియ తెలిపారు. 2024లో వివిధ పత్రికలు, మీడియాల్లో ప్రచురితమై.. పాఠకుల మన్నలు పొందినవి మాత్రమే పోటీలకు అర్హత పొందుతాయని కార్యదర్శి డాక్టర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మూడేసి ప్రతుల చొప్పున ఈనెల ఐదో తేదీలోపు రామలక్ష్మి నర్సింగ్ హోమ్, సుందరయ్య వీధి, చిత్తూరుకు పంపాలని కోరారు. జూన్ 12వ తేదీన కుప్పం రెడ్డెమ్మ వర్ధంతి కార్యక్రమంలో విజేతలకు పురస్కారం ప్రదానం చేస్తామన్నారు.

మార్కెట్ యార్డు ప్రహరీ కూల్చివేత

చిత్తూరు అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో భాగంగా మార్కెట్ యార్డు ప్రహరీని కూల్చివేశారు. నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశాలతో ఇటీవల ప్రభుత్వ స్థలాలతోపాటు ముందుకొచ్చిన ప్రైవేటు యజమానుల స్థలాల్లో కట్టడాలను అధికారులు తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మార్కెట్‌యార్డు ప్రహరీ, సెక్యూరిటీ గదిని కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు నాగేంద్ర, శుభప్రద, సిబ్బంది పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు వద్ద గేటును తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

'వేసవి శిక్షణ'కు స్పందన



శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులకు సూచనలిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని డిప్యూటీ లైబ్రేరియన్ లలిత తెలిపారు. గురువారం కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్ తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు. ఆదివారం నుంచి ఆటలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉపగ్రంథాలయ అధికారి గజేంద్రబాబు, సిబ్బంది కుమార్, గుణ, ముని, పూర్ణిమ, భాను, తులసికుమార్, దేవి, సరస్వతి, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదా: స్థానిక గ్రంథాలయంలో జరిగిన శిక్షణ శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, భరతనాట్యం, ఇంగ్లీష్ పద్యాలు నేర్పించడం, ఆటలు ఆడించినట్లు లైబ్రేరియన్ సుజాత తెలిపారు.

4న ధర్మరాజుల ఆలయ మహాకుంభాభిషేకం

గుడిపాల, మే 1 (ఆంధ్రజ్యోతి): పిళ్లారికుప్పంలో నూతనంగా నిర్మించిన ద్రౌపదీ సమేత ధర్మరాజు, మునేశ్వరుల ఆలయ మహాకుంభాభిషేకాన్ని ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ఆలయ ధర్మకర్త మొగిలిరెడ్డి, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాపసముద్రం, గుడిపాల, పిళ్లారికుప్పం, ఆదవిదేస గ్రామాల్లో ఊరేగించారు.



ద్రౌపదీ సమేత ధర్మరాజు, మునేశ్వరుల విగ్రహాలు

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

గంగాధరనెల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అన్నివిధాల చేయూత అన్నస్తున్నట్లు టీడీపీ యువత సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ అన్నారు. ప్రభుత్వ విప్ థామస్ సహకారంతో నెల్లేపల్లి పంచాయతీ కొత్తూరుకు చెందిన దివ్యాంగురాలు వనజకు ద్విచక్రవాహనాన్ని పింఛను సొమ్మును గురువారం అందజేశారు. రెండునెలల కిందట గంగాధరనెల్లూరు పర్యటనకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు వనజకు బైక్ అందజేయాల్సి ఉండగా, కొన్ని అవాంతరాల వల్ల అప్పట్లో కుదరలేదని చెప్పారు. నెల్లేపల్లి టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సచివాలయం సర్వేయర్ మధు, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలు వనజకు బైక్, పింఛన్ సొమ్ము అందజేస్తున్న శ్రీధర్‌యాదవ్

పోస్టర్ ఆవిష్కరణ



చిత్తూరు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయినింగ్ పోస్టర్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లోని నమామేమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీవరకు వివిధ అంశాలపై మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణాధికారి సుబ్రహ్మణ్యం, లీగల్ అధికారి వెంకటేష్, ప్రొటెక్షన్ అధికారులు శివ, రాధ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ శాంతి హోమం

బంగారుపాళ్యం, మే1 (ఆంధ్రజ్యోతి): మొగిలీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా దేవారం దలో ఉన్న జలకంఠేశ్వరస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా గురువారం ఉదయం నవగ్రహ శాంతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయదారులుగా టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ దంపతులు వ్యవహరించారు. స్వామిని ఎమ్మెల్యే మురళీమోహన్ దర్శించుకున్నారు. మొగిలీశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు గంగాధర్ గురుకుల్, వేద పండితులు మనోజ్ గురుకుల్, హరీష్ గురుకుల్, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్పీ ధర్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తగ్గువారిపల్లె పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.



నేటినుంచి అభీష్టద మృత్యుంజయేశ్వరుడి బ్రహ్మోత్సవాలు





బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న అశ్వ, నంది, గజ వాహనాలు

చౌడేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె బజారువీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారంనుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ప్రధానార్చకుడు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 1753లో పుంగనూరు జమీందారు ఇమ్మడి చిక్కరాయలు నిర్మించిన పురాతనమైన ఆలయంలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 2న అంకురార్పణ, 3న ధ్వజారోహణం, 4న యాళివాహనం, 5న శేషవాహనం, 6న రావణ బ్రహ్మవాహనం, 7న నంది వాహనాలు, 8న కల్యాణోత్సవం, గజవాహనం, 9న రథోత్సవం, 10న అశ్వవాహనం, 11న హంస వాహనం, ధ్వజావరోహణం, 12న ప్రథమ శయనోత్సవం, 13న ద్వితీయ శయనోత్సవం, 14న ఉయ్యాలోత్సవాలు జరుగుతాయని వివరించారు.

ఎర్రజెండా రెపరెపలు

ఘనంగా మే డే





చిత్తూరు ఆర్టీసీ-2 డిపో వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో.. తగ్గువారిపల్లె పంచాయతీలో ఏఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

చిత్తూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎర్రజెండా రెపరెపలాడింది. కార్మికుల దినోత్సవం(మేడే)ను గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చిత్తూరులో నగరంలో వేలచేట్ల ఇంజనీర్ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజన్, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గంటా మోహన్, వివిధ కార్మిక సంఘాల నాయకులు బాలరాజు, గోపీనాథ్, మణి, వెంకటేష్, జయచంద్ర, విజయ్ గౌరి, జమీలాబీ, రమాదేవి, రము, విజయ్‌కుమార్, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: తగ్గువారిపల్లె పంచాయతీలో పారిశుధ్య కార్మికుల నాయకులు కన్నయ్య, మధు, జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: 49.కొత్తపల్లిమిట్ట ఆటోస్టాండ్ వద్ద జరిగిన వేడుకల్లో సభ్యులు జీవరత్నం, మురుగేష్, ధనంజయ, సురేష్, గోపి, శశి, విష్ణు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: మండలకేంద్రంలో జరిగిన వేడుకల్లో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు షకీలా, వర్కర్లు, ఆటోడ్రైవర్ల సంఘం నాయకులు సెలరాజ్, రమేష్, సురేష్, బాలాజీ పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య, ఆశావర్కర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, నాయకులు రవి, ఏసుపాదం, పరిమళ, సలీన, భువన, లత, మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: బస్టాండులో జరిగిన కార్యక్రమంలో పెనుమూరు మాజీ సర్పంచ్ కృష్ణమూర్తినాయుడు, కార్మికుల యూనియన్ అధ్యక్షుడు రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

నగరి: మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, నాయకులు కోదండయ్య, గోవిందస్వామి, చంద్రారెడ్డి, రాజేంద్రన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: 100 గొల్లపల్లె జైన్ ఇరిగేషన్ పాప్ ప్రెష్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన వేడుకల్లో జైన్ ఎంప్లాయిస్ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు నందనూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, నేతలు నరసింహారెడ్డి, ఆశోక్‌రెడ్డి, సురేష్, సుబ్రమణ్యం, భూపతి, జలంధర్, కార్మికులు పాల్గొన్నారు.



చిత్తూరు రైల్వేస్టేషన్ వద్ద ఆకట్టుకున్న బొమ్మలు

వెదురుకుప్పం: మండలం దేవళంపేటలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే థామస్ సూచనలతో, సీఐటీయూ ఆధ్వర్యంలో నూతనంగా అంబేడ్కర్ ఆటో యూనియన్ ఏర్పాటు చేసినట్లు టీడీపీ యువత నాయకుడు బాషా సలీమ్‌నాయుడు తెలిపారు. యూనియన్ ప్రెసిడెంట్‌గా మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

విజయవాడలో జరిగిన వేడుకల్లో టీఎన్‌టీయూసీ జిల్లా నేతలు



విజయపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం నిర్వహించిన మే డేలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. వీరిలో.. మాధవనాయుడు, గుణశేఖర్‌రెడ్డి, దశరథరాజు, బలాజీ నాయుడు, బాబునాయుడు తదితరులున్నారు.

అమరావతికి తరలిన టీడీపీ నాయకులు

గుడిపాల, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి ప్రధాని మోదీ విచ్చేస్తున్న సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు గురువారం తరలివెళ్లారు. గుడిపాల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో మండలంనుంచి సుమారు వంద మంది వరకు బయల్దేరి వెళ్లారు. దీనికి సంబంధించిన వాహనాన్ని సుబ్రహ్మణ్యం నాయుడు ప్రారంభించగా, నాయకులు ప్రతాప్‌నాయుడు, రవినాయుడు, బాలసుబ్రహ్మణ్యంనాయుడు,కిట్టు,శివలింగారెడ్డి, యోగానందం జేజేఎం యూత్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం నుంచి కూడా టీడీపీ నాయకులు అమరావతికి తరలివెళ్లారు. వీరు బయలేరిన బస్సును ప్రారంభించిన కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్ మురళి, గంటావారిపల్లె సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, కుమార్, నవీన్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు





గుడిపాల, వెదురుకుప్పం నుంచి అమరావతికి బయల్దేరిన వాహనాలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా విజయేంద్రరాజు

తవణంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా విజయేంద్రరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదే మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న విజయేంద్రరాజును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

నిండ్రకు వెంకటేశులు

నిండ్ర: మండలంలోని కవ్వరవేదు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకటేశులును నిండ్ర ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవండి

పెనుమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం తన బృందంతో కలలగుంట, పూనేపల్లె, మరింపల్లె, కొత్తూరు, మొరవకండ్రిగ, కలికిరి, తూపల్లె, ఎల్లంపల్లె గ్రామాల్లో ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. సభ్యులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట, వద్దార్లపల్లె, ఈడిగపల్లె, వెంకటాపురం, పాపానాయుడుపల్లె, చెరుప్రముందరపురం, మూర్తిగానిపూరు, లక్ష్యయ్యపూరు తదితర గ్రామాల్లో గురువారం త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కొళాయిల్లో రంగునీరు

నగరి, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ కొళాయిల్లో తాగునీటికి బదులు రంగునీరు వస్తోందని ఏకాంబరకుప్పం వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి నీరే వస్తున్నట్లు తెలిపారు. తాగునీటిలో ఎక్కడ రంగు కలుస్తుందో పరిశీలించి మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోలాహలంగా వసంతోత్సవం



శివపార్వతుల ఊరేగింపులో పాల్గొన్న యువత

సోమల, మే 1 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని గురువారం వసంతోత్సవం కోలాహలంగా జరిగింది. తప్పెటాన్ని ఆదిగోపించానికి యువకులు పోటీలు పడ్డారు. బజారువీధికి చెందిన పోలారు బాలాజీ తప్పెటాన్ని ఆదిరోహించి విజేతగా నిలిచారు. పురవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు బీటీ. సోమశేఖర్, నరేంద్రబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రైతులకు అండగా చంద్రన్న: టీడీపీ

రామకుప్పం, మే 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వట్ల నారాయణస్వామి, రామకుప్పం పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం రామకుప్పం వ్యవసాయ అధికారి కార్యాలయంలో పలువురి రైతులకు రాయితీతో వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఏవో అమృత, వైస్ ఎంపీపీ వెంకటరామ గౌడ్, గుర్రప్ప, నేతలు గుర్రప్ప, మహమ్మద్ రఫీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

పూతలపట్టు, మే 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ఎస్.నల్లూరు మైలాదవరానికి చెందిన మదిఅళగన్ (58) ఎం.బండపల్లె సమీపాన ఉన్న ఓ ప్రైవేటు పాల ఫ్యాక్టరీకి పాల సరఫరా చేసే లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం లారీలో తిరుపతి నుంచి ఫ్యాక్టరీకి వస్తుండగా పూతలపట్టు వద్దకొచ్చేసరికి ఛాతీలో నొప్పి రావడంతో పోలీసుస్టేషన్ సమీపాన వాహనాన్ని ఆపాడు. అనంతరం ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా అక్కడ కుప్పకూలి మృతి చెందాడు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మదిఅళగన్

కారు ఢీకొని మాజీ సైనికుడికి గాయాలు

పుంగనూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె- పలమనేరు మార్గంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని మాజీ సైనికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. చౌడేపల్లె మం డలం చారాలకు చెందిన మాజీ సైనికుడు శ్రీనివాసులురెడ్డి(49) పెద్దపంజాణి మండలంలోని కమ్మినాయునిపల్లె వద్దగల హెచ్‌పీసీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం విధులు పూర్తి చేసుకుని ద్విచక్రవాహనంలో చారాలకు వెళ్తుండగా మల్లసముద్రం వద్ద కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడడంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



నాయపడిన శ్రీనివాసులురెడ్డి

ద్విచక్రవాహనం అదుపుతప్పి రైతుకు..

పుంగనూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- తిరుపతి మార్గంలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా.. సోమల మండలం ఇరికిపెంటకు చెందిన రైతు శ్రీనివాసులునాయుడు (45) టమోటా పంటకు పురుగులమందు కోసం ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వచ్చాడు. మందులు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో చదళ్ల సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సహాయంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మూడు టన్నుల రేషన్ బియ్యం సీజ్

తిరుపతి(నేరవిభాగం), మే 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నుంచి నెల్లూరుకు తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని తిరుపతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. పలమనేరు, బైరెడ్డిపల్లె, గంగవరం, చిత్తూరు, బంగారుపాళ్యం, తిరుపతి జిల్లా తిరుపతి, పాకాల, చంద్రగిరి నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని వ్యాను ద్వారా నెల్లూరుకు తరలిస్తున్నారు. తిరుపతి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ సురేంద్రకు అందిన సమాచారం మేరకు వెస్ట్ సీఐ మురళీమోహన్ నేతృత్వంలో పోలీసులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది కృష్ణాపురం ఠాణా వద్ద పట్టుకున్నారు. మూడు టన్నుల రేషన్ బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేశారు. బైరెడ్డిపల్లె మండలం బెల్లుపల్లనుకు గ్రామానికి చెందిన ఎంకిషోర్ రెడ్డి హస్తమున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వెస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విద్యార్థులకు ఎంఈవో సూచన

చిత్తూరు కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలభవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఎంఈవో సెల్వరాజ్ సూచించారు. గురువారం బీఎన్ కళ్యాణ్ హైస్కూలులో జిల్లా బాల భవన్ ఆధ్వర్యంలో చిత్రలేఖన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈనెల 30వ తేదీవరకు శిక్షణ కొనసాగుతుందని జిల్లా బాలభవన్ చిత్రలేఖన టీచర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టండి: డీపీవో

యాదమరి, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని సిబ్బందిని డీపీవో సుధాకరరావు ఆదేశించారు. మండలంలోని కోనాపల్లె, పెరియంబాడి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. రోడ్ల పక్కన పేడదిబ్బలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్పీ షణ్ముగం, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, కార్యదర్శి దివ్య తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న సుధాకరరావు

సంక్షిప్తంగా..

రోడ్డు నిర్మాణానికి రూ.56లక్షలు మంజూరు

పెనుమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. తాజాగా నంజరపల్లె పంచాయతీలోని మరింపల్లె నుంచి తూపల్లె రోడ్డు నిర్మాణానికి రూ.56 లక్షలు నాబార్డు నిధులు మంజూరయ్యాయి. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ద్రౌపది కల్యాణం

పాలసముద్రం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆముదాలలో నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారతంలో భాగంగా ద్రౌపదీ కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కర్ణాటక మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, నాయకులు తాళ్లూరు శివానాయుడు, సుదర్శన్‌నాయుడు, అరుళ్‌నాథన్, బాస్కర్‌నాయుడు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), మే 1 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన విజయలక్ష్మమ్మ రూ.1,00,116 గురువారం విరాళంగా అందించారు. దాతకు ఆలయ సూపరింటెండ్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి నివాళి

గుడిపాల, మే 1 (ఆంధ్రజ్యోతి): కమ్మిత్మ్మాపల్లె మాజీ సర్పంచ్ విజయ్ గుండెపోటుతో మరణించడం పార్టీకి తీరని లోటని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, సీనియర్ నేత గురజాల చెన్నకేశవనాయుడు అన్నారు. గురువారం సుబ్రహ్మణ్యం మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

అలరించిన కీచకవధ నాటకం

వెదురుకుప్పం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 'కీచకవధ' వీధి నాటకం అలరించింది. ద్రౌపది అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్వేటినగరం మండలం అమ్మపల్లె మహాభారతం ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి కీచకవధ వీధి నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు.

పేద వధువరులకు చేయూత



చిత్తూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని పుల్లూరుపల్లెకు చెందిన శోభన్‌బాబు, సంధ్యల వివాహం గురువారం జరిగింది. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో నగరానికి చెందిన సేవాతత్పరులు పార్థసారథి యుదు వారికి చేయూతనందించారు. కొత్త బట్టలు, తాళిబొట్టు అందజేశారు.

10నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.